# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-01-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తిరుపతి జిల్లా నారావారిపల్లెలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.**

2. **సంక్రాంతి పండుగ దృష్ట్యా ప్రైవేట్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి .**

3. **రాజధానికి భూములిచ్చిన రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ.**

4. **రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్న పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.**

==========================

తిరుపతి జిల్లాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నారావారిపల్లెలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో కుటుంబసభ్యులతో కలిసి ఈ రోజు పాల్గొన్నారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ క్రీడా పోటీలను, ముగ్గుల పోటీలను ప్రారంభించారు. అంతకుముందు ప్రజల నుంచి ముఖ్యమంత్రి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ పర్యటనలో భాగంగా నారావారిపల్లెలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ఈ రోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

-------------------------

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేట్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ రద్దీ దృష్ట్యా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం యథవిధిగా కొనసాగుతుందని, పండుగ సందర్భంగా ఎలాంటి అదనపు రుసుము విధించబోమని స్పష్టం చేశారు. సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే వారు రహదారి నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చార్జీలు వసూలు చేస్తే సంబంధిత బస్సులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

-------------------------

రాజధానికి భూములిచ్చిన రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

పి.నారాయణ తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం కర్లపూడిలో రహదారి నిర్మాణ పనులకు స్థానిక శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్‌తో కలిసి మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణ పాత్రికేయులతో మాట్లాడారు. భూసమీకరణ కార్యక్రమానికి వచ్చినపుడు స్థానిక రైతులు రహదారి నిర్మాణం చేయాలని కోరారని, వారి విజ్ఞప్తి మేరకు రహదారి పనులు ప్రారంభించామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్ -- విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ కొనసాగుతోంది. హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి వస్తున్న వాహనాలతో రహదారులు నిండిపోయాయి.ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.ఈ తెల్లవారుజామున భారీ సంఖ్యలో వాహనాలు కీసర టోల్‌ప్లాజా మీదుగా వెళ్లాయని అధికారులు తెలిపారు. రద్దీకి అనుగుణంగా ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మరోవైపు రైల్వేస్టేషన్లలోనూ ప్రయాణికుల రద్దీ పెరిగింది.

---------------------------

దేశానికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న Pro-Active Governance and Timely Implementation- ప్రగతి సమావేశాలు దోహదపడ్డాయి. ఇందులో భాగంగా ప్రగతి సమావేశం ద్వారా పురోగతి సాధించిన బీహార్‌లోని పాట్నా-గంగా రోడ్డు రైలు వంతెన ప్రాజెక్టు గురించి ఈ రోజు తెలుసుకుందాం. బీహార్ ఉత్తర-దక్షిణ ప్రాంతాల సమస్యలను పరిష్కరించడానికి గంగా నదిపై పాట్నా-గంగా రైలు కమ్ రోడ్ వంతెన ప్రాజెక్టు రూపకల్పన చేశారు.

2001 నవంబర్‌లో మూడు వేల 774 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్ట్ రూపొందించారు. అయితే ఈ ప్రాజెక్టుకు భూమి సంబంధిత అడ్డంకులు, ఆక్రమణలు, పునరావాసం వంటి సవాళ్లు ఎదురయ్యాయి. ప్రాజెక్ట్ అమలులో జాప్యం కారణంగా, దాని ఖర్చు ఐదు రెట్లు పెరిగింది. 2015 మార్చి 25న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రగతి సమావేశంలో ఈ ప్రాజెక్టును సమీక్షించారు. కేంద్రీకృత పర్యవేక్షణ అమలు సవాళ్లను సకాలంలో పరిష్కరించడంతో మార్చి 4 2022న ప్రాజెక్ట్ పూర్తయింది. ఈ వంతెన గంగా నదిపై రవాణా సదుపాయాన్ని మెరుగుపరిచింది. లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించింది ప్రాంతీయ అనుసంధాన్ని బలోపేతం చేసింది.

---------------------------

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లంకపల్లె గ్రామంలో నిన్న రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామంలోని దాదాపు 38 పూరిపాకలు దగ్ధమైయ్యాయి. ఈ ప్రమాద ఘటనలో ఎటువంటి మరణాలు సంభవించలేదని, మంటలు అదుపులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పత్తిపాడు శాసన సభ్యురాలు వి.సత్యప్రభ పరిశీలించి స్థానికులు, అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

కాకినాడ జిల్లాలో జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహించారు. పండుగ సమయంలో అగ్ని ప్రమాదం విషాదం తెచ్చిందని విచారం వ్యక్తం చేశారు. ఇళ్లు కాలిపోయిన ఘటనలో బాధితులకు అన్ని విధాలుగా సహాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తక్షణ సాయంగా ఒక్కో బాధిత కుటుంబానికి 25 వేల రుపాయలను అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ కొత్త ఇల్లు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదంలో కాలిపోయిన పలు పత్రాలు, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో నిన్న మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాయితీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నామని చెప్పారు. సంక్రాంతి పండుగను ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వాయిస్ 33 సెకన్లు

---------------------------

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చేనేత వస్త్రాలను, లేపాక్షి కళారూపాలను ఆన్ లైన్ ఈ కామర్స్‌లో లభించేలా చర్యలు తీసుకోవాలని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో లేపాక్షి అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండగ దృష్ట్యా 10, 20 30 శాతం రాయితీతో కళారూపాల అమ్మకాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్ లైన్ లో విక్రయాల కోసం ప్రత్యేక వెబ్ సైట్ ఏర్పాటు చేయాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో తొలిసారిగా "ముస్తాబు కార్యక్రమం" ద్వారా వసతి గృహాల విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ బోర్డు 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను మంత్రి నిన్న ఆవిష్కరించారు.

---------------------------

గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నుంచి శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికకు ఆహ్వానం అందింది. ఈ ఆహ్వాన పత్రాన్ని రాష్ట్రపతి కార్యాలయం నుంచి పంపగా తపాలా అధికారులు ఆమె స్వగ్రామం తంబాలహట్టికి వెళ్లి ఈరోజు అందజేశారు.

=====================